

# తెలంగాణకు స్వర్ణం

బాస్కెట్‌బాల్‌లో మెరిసిన అమ్మాయిలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో తొలి స్వర్ణం చేరింది. మంగళవారం జరిగిన మహిళల 3X3 బాస్కెట్‌బాల్ ఫైనల్లో తెలంగాణ 21-11తో కేరళపై అద్భుత విజయం సాధించి పసిడి పతకం కైవసం చేసుకుంది. మ్యాచ్ ఆసాంతం తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన రాష్ట్ర జట్టు విజయ కేతనం ఎగరవేసింది. రెండేండ్ల క్రితం గోవాలో జరిగిన తుది పోరులోనూ మన మహిళల జట్టు అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ జట్టులో పుష్ప, హర్షిత, ప్రియాంక, గుల్బాశ్ అలీ అదరగొట్టారు. మరోవైపు పురుషుల బాస్కెట్‌బాల్ తుదిపోరులో మధ్యప్రదేశ్ 22-20తో కేరళపై గెలిచి స్వర్ణం దక్కించుకుంది. తెలంగాణ ప్రస్తుతం ఒక స్వర్ణం, రెండు కాంస్యాలతో 24వ స్థానంలో కొనసాగుతున్నది.

# త్రిషకు ఘనస్వాగతం

హైదరాబాద్ చేరుకున్న ధ్రుతి, నౌషిన్, షాలిని

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక అండర్-19 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు క్రికెటర్లు గొంగడి త్రిష, కేసరి ధ్రుతికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు.. క్రికెటర్లకు శాలువాలతో సన్మానం చేశారు. వీరితో పాటు టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ నౌషిన్ అల్ ఖదీర్, ట్రైనర్ షాలినిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచకప్ విజేతలు త్రిష, ధ్రుతికి స్వాగతం పలికేందుకు క్రికెట్ అభిమానులకు ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా త్రిష మాట్లాడుతూ 'కెరీర్‌లో రెండోసారి ప్రపంచకప్ గెలువడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా స్కాట్లాండ్‌పై రికార్డు సెంచరీకి తోడు దక్షిణాఫ్రికాతో ఫైనల్ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన మరిచిపోలేనిది. జట్టు సభ్యులందరం ఒక కుటుంబంలా మెదులుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాం. రానున్న రోజుల్లో సీనియర్ జట్టుకు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. నా ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యుల మద్దతు మరువలేనిది'అని పేర్కొంది. మరోవైపు జగన్ స్పందిస్తూ 'త్రిష, ధ్రుతిని స్ఫూర్తిగా మరింత మంది మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి. త్రిష అద్భుత ప్రదర్శనతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేసింది. త్వరలో అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి నగదు ప్రోత్సాహకం ప్రకటిస్తాం' అని అన్నారు.



## ముంబై జట్టులో సూర్య, దూబె


ముంబై: ఇంగ్లండ్‌తో స్వదేశంలో టీ20 సిరీస్ ముగిసిన వెంటనే ఈ ఫార్మాట్‌లో భారత సారథిగా ఉన్న సూర్యకుమార్ యాదవ్‌తో పాటు ఆల్‌రౌండర్ శివమ్ దూబె రంజీల బాట పట్టారు. ఈనెల 8 నుంచి హర్యానాతో జరుగబోయే రంజీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు ఈ ఇద్దరూ ముంబై తరపున ఆడనున్నారు. ఈ మేరకు ముంబై ప్రకటించిన 18 మంది జట్టు సభ్యులలో సూర్య, దూబె చోటు దక్కించుకున్నారు.



## జర్మనీ ప్లేయర్‌కు కేఎస్‌జీ స్పాన్సర్‌షిప్

హైదరాబాద్: జర్మనీ యువ టెన్నిస్ సంచలనం అరియా లాంక్రిసెంట్‌కు కేఎస్‌జీ(కంకణాల స్పోర్ట్స్ గ్రూపు) స్పాన్సర్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హ్యాండ్‌బాల్, వాలీబాల్, రేసింగ్, బ్యాడ్మింటన్‌లో భాగమైన కేఎస్‌జీ తొలిసారి టెన్నిస్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 8ఏండ్ల అరియాతో 10 ఏండ్లకు స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేఎస్‌జీ యజమాని అభిషేక్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. 'భారత్‌లో టెన్నిస్‌కు మంచి ఆదరణ ఉంది. గ్రాండ్‌స్లామ్ టోర్నీలకు ఐపీఎల్‌తో సమానంగా వీక్షణలు ఉన్నాయి' అని అన్నారు.

## ఒంటికాలిపై 193 కిలోల బరువుతో..



డెహ్రాడూన్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఎస్ఎస్‌సీబీ వెయిట్ లిఫ్టర్ జగదీశ్.. రెండు చేతులపై 193 కిలోల బరువును ఒంటికాలిపై నిలబడి నటరాజ విన్యాసాన్ని ప్రదర్శించాడు. గతేడాది సైతం అతడు ఈ తరహా ప్రదర్శనతో వార్తల్లో వ్యక్తిగా నిలిచాడు.

# వరుణ్ 2.0

రీఎంట్రీలో అదరగొడుతున్న మిస్టరీ స్పిన్నర్



నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రపంచ క్రికెట్‌లో మిస్టరీ స్పిన్నర్లకు కొదవలేదు. అయితే వారిలో ఒకరిద్దరు మినహా మిగిలినవారు ఎంత త్వరగా గుర్తింపు సాధించారో అంతే త్వరగా తమ లయను కోల్పోయి కెరీర్ మధ్యలోనే కనుమరుగైపోయారు. ఏడాదికాలంగా నిలకడగా రాణిస్తున్న భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. తనదైన బౌలింగ్ శైలితో 2021లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన వరుణ్.. ఆరంభంలోనే దారుణమైన అవమానాలను ఎదుర్కొన్నాడు. 'ఇలాంటి బౌలర్ మా దేశంలో గల్లీకొకడు ఉన్నాడు. చిన్నప్పుడు రబ్బర్ బాల్ క్రికెట్ ఆడినప్పుడే ఇటువంటి బౌలింగ్‌ను చీల్చి చెండాడాం'అంటూ పాకిస్థాన్ మాజీ క్రికెటర్ల వెక్కిరింతలతో అతడి కెరీర్‌కు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. 2021లో దుబాయ్ వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ (వరుణ్‌కు అది అతడి కెరీర్‌లో నాలుగో టీ20)లో అశ్విన్, చాహల్ వంటి స్పిన్నర్లను కూడా పక్కన బెట్టిన టీమ్ మేనేజ్‌మెంట్.. వరుణ్‌కు అవకాశాన్నిచ్చింది. కానీ ఆ మ్యాచ్‌లో బాబర్, రిజ్వాన్ మెరుపులకు వరుణ్ తేలిపోయాడు. ఆ టోర్నీ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన అతడు.. మూడేండ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చి నిలకడగా రాణిస్తూ పొట్టి ఫార్మాట్‌లో కీలక స్పిన్నర్‌గా ఎదుగుతున్నాడు. స్వదేశంలో బంగ్లా సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చిన వరుణ్.. పేస్‌కు అనుకూలించే దక్షిణాఫ్రికా పిచ్‌లపైనా అంచనాలకు మించి రాణించాడు. 4 మ్యాచ్‌లలో 12 వికెట్లు తీసిన ఈ చెన్నై స్పిన్నర్.. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఏకంగా 14 వికెట్లు పడగొట్టి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2021లో ఆరు మ్యాచ్‌లలో 2 వికెట్లు మాత్రమే తీసిన వరుణ్.. 2024 నుంచి ఆడిన 12 మ్యాచ్‌లలో 31 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఐపీఎల్‌లో ఆరంభం నుంచీ కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున ఆడుతున్న వరుణ్.. 2021లో జాతీయ జట్టుకు దూరమయ్యాక తన బౌలింగ్ శైలిని మార్చుకున్నాడు. బంతి వేగాన్ని తగ్గించిన అతడు తన శైలికి వైవిధ్యాన్ని మేళవించి అదరగొడుతున్నాడు. సాధారణంగా లెగ్ స్పిన్ బౌలింగ్ చేసే బౌలర్లు విసిరే బంతుల వేగం 100-110 కిలోమీటర్ల (గంటకు) వరకు ఉంటుంది. కానీ వరుణ్ ఈ ఏడాది కాలంలో వికెట్లు సాధించిన బంతుల వేగం లెగ్ స్పిన్ (94.6కి.మీ), గూగ్లీ (92.3 కి.మీ)గా ఉండటం విశేషం. 'సైడ్ స్పిన్'తో లాభం లేదని గ్రహించిన అతడు.. 'ఓవర్ స్పిన్'తో మాయ చేస్తున్నాడు. అతడి ఎత్తు కూడా బంతి వేగాన్ని నియంత్రించేందుకు ఉపయోగపడుతోంది. అయితే ఈ స్థితికి రావడానికి సుమారు రెండేండ్లు నెట్స్‌లో శ్రమించాల్సి వచ్చిందని వరుణ్ తెలిపాడు. ఐపీఎల్‌తో పాటు తమిళనాడు ప్రీమియర్ లీగ్, ముస్తాక్ అలీ, విజయ్ హజారే.. ఇలా ఏ టోర్నీనీ మిస్ అవకుండా తనను తాను పరీక్షించుకుంటూ తప్పులను సరిదిద్దుకున్నాడు. ఆ కష్టానికి తగ్గ ఫలితాలే ఇప్పుడొస్తున్నాయని వరుణ్ గర్వంగా చెబుతున్నాడు. అతడు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే కీలక ఆటగాడిగా మారే అవకాశముంది.

## చాంపియన్స్ ట్రోఫీకి వరుణ్!

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ కోసం జట్టుతో చేరిక

నాగ్‌పూర్: గతేడాది అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేసిన తర్వాత అంచనాలకు మించి రాణిస్తున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి బంపరాఫర్ తగిలే అవకాశముంది. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో ఏకంగా 14 వికెట్లు పడగొట్టి భారత్ సిరీస్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన వరుణ్.. గురువారం నుంచి మొదలుకావాల్సి ఉన్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కూ జట్టుతో చేరాడు. మంగళవారం వరుణ్.. నెట్స్‌లో బౌలింగ్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. అంతేగాక పాత్రికేయుల సమావేశంలో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం స్పందిస్తూ.. 'అవును. వరుణ్ కూడా జట్టులో భాగం' అని తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు వరుణ్‌తో వన్డే సిరీస్ ఆడించి ఆ ప్రదర్శనల ఆధారంగా అతడిని మెగా టోర్నీలో ఆడించాలని గంభీర్ భావిస్తున్నట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 12 దాకా చేసుకునే అవకాశమున్న నేపథ్యంలో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ వరుణ్‌కు కీలకం కానుంది. అతడు తుది జట్టులోకి వస్తే మాత్రం కుల్‌దీప్, అక్షర్, సుందర్‌లో ఎవరో ఒకరి మీద వేటు పడే అవకాశాలున్నాయి.

## క్రికెట్‌కు కరుణరత్నె వీడ్కోలు

గాలె: శ్రీలంక మాజీ సారథి దిముత్ కరుణరత్నె అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గురువారం నుంచి గాలె వేదికగా ఆస్ట్రేలియాతో జరుగబోయే రెండో టెస్టు తన కెరీర్‌లో చిట్టచివరి మ్యాచ్ అని అతడు తెలిపాడు. ఈ మ్యాచ్ కరుణరత్నె టెస్టు కెరీర్‌లో వందోవది కావడం గమనార్హం. 36 ఏండ్ల ఈ మాజీ కెప్టెన్ తన 14 ఏండ్ల కెరీర్‌లో 99 టెస్టులాడి 7,172 పరుగులు చేశాడు. ఇందులో 16 శతకాలు, 34 అర్ధ శతకాలున్నాయి.

## ఒక్క చెత్త సిరీస్‌తో మమ్మల్ని..

గిల్ ఆసక్తికర వ్యాఖ్యలు

నాగ్‌పూర్: ఒక మ్యాచ్, ఒక టెస్టు సిరీస్‌లో రాణించనంతమాత్రానా జట్టు ఫామ్‌ను నిర్వచించలేమని టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్, ఆస్ట్రేలియా పర్యటనలో 1-3తో సిరీస్‌ను కోల్పోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో గిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆరంభానికి ముందు నాగ్‌పూర్‌లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గిల్ మాట్లాడుతూ.. 'ఒక్క సిరీస్‌తో జట్టు ఫామ్‌ను నిర్వచించలేం. మా జట్టు క్రికెటర్లు గతంలో సిరీస్‌లు, టోర్నమెంట్‌ల్లో నిలకడగా ఆడిన సందర్భాలు చాలా ఉన్నాయి. సిడ్నీ టెస్టులో బుమ్రా లేకపోవడంతో సిరీస్‌ను డ్రా చేసుకునే అవకాశాలను కోల్పోయాం. ఒక మ్యాచ్, ఒక సిరీస్ మా ఫామ్‌ను బేరీజు వేయలేదు. గతంలో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని రెండు సార్లు గెలుచుకున్నాం. టీ20 ప్రపంచకప్‌ను నెగ్గాం..' అని అన్నాడు.

## బుమ్రా వచ్చేనా?

బెంగళూరు: మరికొద్దిరోజుల్లో మొదలుకాబోయే చాంపియన్స్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడతాడా? లేదా? అన్నదానిపై సందిగ్ధత వీడటం లేదు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆఖరి టెస్టులో వెన్ను నొప్పి కారణంగా ఆ మ్యాచ్ నుంచి తప్పుకున్న బుమ్రా.. ఆదివారమే ఎన్‌సీఏకు చేరుకున్నాడు. గాయం తీవ్రత, ఫిట్‌నెస్‌పై నిర్వహించిన వైద్య పరీక్షలలో సంతోషకరమైన ఫలితాలు రాలేదని తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో అయితే అతడు ఆడేది అనుమానమేనని బీసీసీఐ ప్రతినిధి తెలిపారు. బుమ్రా విషయంలో బీసీసీఐ కూడా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఒకవేళ పూర్తిగా ఫిట్‌నెస్ సాధించకుంటే బుమ్రా లేకుండానే ఆడాల్సి ఉంటుంది.

# కథలో విషయం ఉంటే ట్యూన్స్ ఆటోమేటిగ్గా వస్తాయి..

ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ.. మారుతున్న ప్రతి జనరేషన్లోనూ మ్యూజిక్ డైరెక్టర్‌గా అగ్ర స్థానంలోనే ఉంటున్నారు దేవిశ్రీ ప్రసాద్. సంగీత దర్శకునిగా నిండా పాతికేళ్ల కెరీర్ ఆయనది. ఇంత లాంగ్విటీ ఉన్న సంగీత దర్శకులు అరుదు. అలాంటి ఈ అరుదైన సంగీత రత్నం స్వరాలందించిన తాజా చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు దేవిశ్రీ.



- కంప్లీట్ రస్టిక్ ఫోక్ స్టోరీకి మ్యూజిక్ ఇవ్వాలనే కోరిక నాకెప్పట్నుంచో ఉండేది. ఆ కోరిక 'రంగస్థలం'తో తీరింది. అందులోని పాటలన్నీ జానపద మూలాల్లో నుంచి చేసినవే. నా సినిమాల్లో ఫోక్ టచ్ ఉన్న మరో సినిమా 'ఉప్పెన'. అదొక విభిన్నమైన కంపోజిషన్. కాస్త సూఫీ స్టైల్‌లో క్లాస్ మిక్స్ చేసినట్టుగా ఆ పాటలుంటాయి. ఇప్పుడు 'తండేల్'. ఇది కూడా ఫోక్ టచ్ ఉన్న సినిమానే. పాకిస్తాన్ సరిహద్దుల్లో చిక్కుకుపోయిన మత్స్యకారుల కథ ఇది. రియలిస్టిక్ అంశాలతో రాసుకున్న ఈ కథలో అద్భుతమైన ప్రేమ ఉంటుంది. భావోద్వేగాలుంటాయి. కథలో అంత విషయం ఉంది కాబట్టే.. అంతమంచి పాటలు వచ్చాయి. ఇప్పటికి మూడు పాటలు విన్నారు. రాబోయే పాటలు కూడా అద్భుతంగా ఉంటాయి.
- విషయం ఉన్న కథ తేలిగ్గా మనసులోకి వెళ్లిపోతుంది. అలాంటి కథ వింటున్నప్పుడు ఆటోమేటిగ్గా ట్యూన్స్ వచ్చేస్తాయి. డైరెక్టర్ చందు ఈ కథ చెబుతున్నప్పుడే కొన్ని ట్యూన్స్ వచ్చేశాయి. 'బుజ్జి తల్లి' ట్యూన్ అలా వచ్చిందే. హమ్ చేస్తూ పియోనో ప్లే చేశాను. ఆ వీడియోను చందు షూట్ చేసి పోస్ట్ చేశాడు. ఆ ట్యూన్ మధ్యలో అమ్మాయి పేరు వస్తే అందంగా ఉంటుంది. అందుకు తగ్గ ప్లేస్‌మెంట్ కూడా ఉంది. అందుకే 'బుజ్జి తల్లి' అనే పదాన్ని యాడ్ చేశాం. ఈ పాట రిలీజవ్వగానే ట్రమండస్ రెస్పాన్స్ వచ్చింది. సుకుమార్ ఈ పాట విని... 'నీ ఆల్‌టైమ్ టాప్ ఫైవ్‌లో ఉంటుంది.' అని చెప్పారు. అలాగే శివునిపాట, హైలెస్సో పాట జనాల్లోకి బాగా వెళ్లాయి.
- డైరెక్టర్ చందూ గ్రేట్ విజన్‌తో ఈ సినిమా తీశాడు. ఎమోషన్స్‌ని అద్భుతంగా ప్రెజెంట్ చేశాడు. యాక్షన్ ఎపిసోడ్స్ కూడా ఓ రేంజ్‌లో ఉంటాయి. సముద్రంలో బోట్ సీక్వెన్స్ అయితే గూజ్‌బంప్స్ తెప్పిస్తుంది. నాగచైతన్య ఈ సినిమాకోసం చాలా కష్టపడ్డారు. తండేల్ రాజుగా ట్రాన్స్‌ఫర్మేషన్ కావడానికి ఆయన తీసుకున్న శ్రమ అసాధారణం. ఇక సాయిపల్లవి అయితే ఎక్స్‌ట్రార్డినరీ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చారు. స్క్రీన్‌పై ఇద్దరి కెమిస్ట్రీ అదిరిపోయింది. ఆ అందం బిగ్ స్క్రీన్‌పైనే చూడాలి. అరవింద్ అంకుల్ నేతృత్వంలో బన్నీవాసు గ్రాండియర్‌గా సినిమా తీశారు. కచ్చితంగా సినిమా పెద్ద విజయం సాధిస్తుంది.
- 'తండేల్' కథ విని.. 'మ్యూజిక్ డైరెక్టర్‌గా దేవిశ్రీని ఫిక్స్ చేసుకోండి..' అని బన్నీనే అరవింద్ అంకుల్‌కి చెప్పారట. ఆ నమ్మకాన్ని నిజం చేశాననే అనుకుంటున్నా. ఇటీవల బన్నీ నన్నొక కోరిక కోరాడు. సినిమాలో ఆరు పాటలుంటే.. ఆ ఆరూ కూడా చక్కని లవ్ మెలొడీలుగా ఉండే ఓ ప్రేమకథ చేయాలనేది తన కోరిక. ఈ విషయాన్ని ఓ పేపర్‌పై రాసి, 'గుర్తుపెట్టుకో.. మనం అలాంటి సినిమా చేయాలి' అని రాసిచ్చారు. అన్నీ కుదిరితే చేస్తాం..



## మలినేనితో మళ్లీ..?

రెండేళ్ల క్రితం 'వీరసింహారెడ్డి'గా బాలకృష్ణ చేసిన సంక్రాంతి సందడి అంతా ఇంతా కాదు. మలినేని గోపీచంద్ దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమా వందకోట్ల విజయాన్ని సాధించి బాలయ్య కెరీర్‌లో మెమరబుల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. మొన్నటి సంక్రాంతికి కూడా 'డాకూ మహరాజ్'గా బాక్సాఫీస్‌ని షేక్ చేశారు బాలకృష్ణ. ఓ వైపు వరుస విజయాలు, మరోవైపు పద్మభూషణ్ పురస్కారం.. మొత్తానికి బాలకృష్ణ మామూలు ఫామ్‌లో లేరు. ఈ జోష్‌లోనే మరోసారి మలినేని గోపీచంద్‌తో చేతులు కలిపారాయన. మైత్రీమూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం బోయపాటి 'అఖండ-తాండవం' షూటింగ్‌లో బాలకృష్ణ బిజీగా ఉన్నారు. దసరాకు ఆ సినిమా విడుదల కానుంది. మలినేని గోపీచంద్ కూడా బాలీవుడ్‌లో సన్నీడియోల్‌తో 'జాత్' అనే సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాకే ఈ తాజా ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని తెలుస్తున్నది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.


చిత్రం

## 'ఫౌజీ'లో సాయిపల్లవి?



అగ్ర కథానాయిక సాయిపల్లవి నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆమె నటించబోయే తెలుగు సినిమా ఏమిటన్నది అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ భామ హిందీలో రామాయణ పార్ట్-1, ఏక్‌దిన్ సినిమాలతో బిజీగా ఉంది. సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండే సాయిపల్లవి తెలుగు స్క్రిప్ట్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నదని చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ అమ్మడు ప్రభాస్ 'ఫౌజీ' చిత్రంలో కీలకమైన పాత్రలో నటించనుందని తెలిసింది. స్వాతంత్రోద్యమ కాలంలో ఓ సైనికుడి ప్రేమకథగా 'ఫౌజీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్నది. కథానుగుణంగా సినిమాకు ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఆయువుపట్టులా ఉంటుందట. ఇందులో ప్రభాస్ ప్రేయసిగా సాయిపల్లవిని నటింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలాంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

## ఉగాది రోజున శ్రీకారం



అగ్ర హీరో ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' 'ఫౌజీ' చిత్రాలు ప్రస్తుతం షూటింగ్‌లో ఉన్నాయి. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' త్వరలో సెట్స్‌మీదకెళ్లనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయని తెలుస్తున్నది. 'యానిమల్' వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాపై ప్రభాస్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అందుకు తగినట్లుగానే పవర్‌ఫుల్ పోలీస్ కథతో స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట సందీప్ రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ సిన్సియర్ అండ్ ఫెరోషియస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. ఈ సినిమా మేలో సెట్స్ మీదకు వెళ్లనుందని గతంలో వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉగాది పర్వదినం సందర్భంగా ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిసింది. 'ది రాజాసాబ్' 'ఫౌజీ' షూటింగ్స్ పూర్తయిన తర్వాత ప్రభాస్ 'స్పిరిట్' కోసం పూర్తి సమయాన్ని వెచ్చించనున్నారని, ఈ సినిమాకు ఆయన బల్క్‌డేట్స్ కేటాయించారని అంటున్నారు.

## ఇలాంటి పాత్ర చేయడం ప్రథమం



'ఇది ప్రేమ నేపథ్యంలో సాగే క్రైమ్ స్టోరీ. ఇందులో క్రిమినల్ లాయర్‌గా నటించాను. కథాగమనంలో నెమ్మదిగా నాలోని ఒక్కో షేడ్ బయట పడుతుంది. క్రిమినలా? లేక క్రిమినల్ లాయరా? అన్నట్టుగా నా కేరక్టర్ ఉంటుంది. నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయడం ప్రథమం' అని సాయిరామ్‌శంకర్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓ పథకం ప్రకారం'. మలయాళ దర్శకుడు వినోద్‌కుమార్ విజయన్ స్వీయదర్శకత్వంలో గార్లపాటి రమేష్‌తో కలిసి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయిరామ్‌శంకర్ మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇది 80శాతం క్రైమ్ జానర్. ఈ కథకు సరిగ్గా సరిపోయే టైటిల్ ఇది. నా పాత్రకోసం నెలరోజులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. వర్క్ షాప్స్ కూడా చేశాను. వినోద్ మలయాళ దర్శకుడైనప్పటికీ తెలుగు సినిమాలంటే ఆయనకిష్టం. ఇక్కడి స్టైల్‌ని బాగా ఇష్టపడతారు. అందుకు తగ్గట్టే సినిమా తీశారు. కథ డిమాండ్ మేరకు చాలా రిస్కీ ఫైట్స్ చేశాను. ఎనిమిది రోజులు క్లైమాక్స్ షూట్ చేశాం. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నా.' అని తెలిపారు సాయిరామ్‌శంకర్.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.